ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు



వేడేకల్లో పాల్గొన్న చైర్మన్ స్వామిగౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. సర్వాయి పాపన్నగౌడ్ 350 ఏళ్ల క్రితం రాజులతో పోరాడి విజయం సాధించి గోల్కొండ కోటను ఏలిన బహుజన చక్రవర్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం ట్రెజరర్ హరిచరణ్‌గౌడ్, ప్రేమ్‌దాస్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ అధ్యక్షులు శ్రీనివాస్‌నాయి, మాదిగ దండోరా అధ్యక్షులు మహేష్‌మాదిగ, రజక సంఘం అధ్యక్షులు అనంతయ్య, నాయకులు జగదీష్‌గౌడ్, చంద్రకుమార్, కిరణ్‌గౌడ్, వెంకటేష్, మున్సిపల్ కార్పొరేషన్ గౌడ్ సంఘం ముఖ్య నాయకులు, బహుజన కుల సంఘాల పెద్దలు, గీత కార్మికులు పాల్గొన్నారు.

మంచినీటి మ్యాన్‌హోల్స్‌లో మట్టికుప్పలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీటి సరఫరా చేసే మ్యాన్‌హోల్స్ పూర్తిగా మట్టి, బురదతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. వరద నీటితో పాటు డ్రైనేజీ నీరు ఈ మ్యాన్‌హోల్స్‌లో పేరుకుపోతుంది. నీటిని సరఫరా చేసేందుకు ఈ మ్యాన్‌హోల్స్‌లోనే వాల్ ఉంటుంది. అయితే ఈ వాల్‌లో మట్టి పేరుకుపోవడంతో వాల్ తిప్పేందుకు సైతం వీలు లేకుండా పోతుందని స్థానికులు తెలుపుతున్నారు. దీంతో స్థానికంగా ఉన్న కాలనీలు, బస్తీలకు నీటి సరఫరా కావడం లేదు. నీటి సరఫరా అయినప్పటికీ పూర్తిగా కలుషిత నీరు వస్తుందని భరత్‌నగర్ కాలనీ వాసులు వెల్లడిస్తున్నారు. జలమండలి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కలుషితనీరు తాగాల్సి వస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు తాగడం వల్ల అనేక రోగాల బారిన పడుతున్నామని కాలనీల వాసులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, సిబ్బంది వెంటనే స్పందిచాలని ప్రజలు కోరుతున్నారు.



మ్యాన్‌హోల్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు

వాన కోసం మహిళల కప్పాట



మల్కారంలో కప్పాట ఆడుతున్న మహిళలు

శంషాబాద్ రూరల్: వాన దేవుడు కరుణించాలని మహిళలు పాటలు పాడుతూ కప్పాటతో ఊరేగారు. మండలంలోని మల్కారంలో ఆదివారం గ్రామంలో నాగలి దున్నేందుకు వాడే కాడిమాకుకు కప్పలను వేలాడదీసి, వేప కొమ్మలతో అలంకరించి వీధుల్లో తిరిగారు. ఈ ఏడాది సరిగ్గా వర్షాలు కురవక సాగుకు ఇబ్బందులు పడుతున్నారు.

వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం దుర్గానగర్ చౌరస్తాలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలాకి చేరుకున్న పోలీసులకు అతను భిక్షాటన చేస్తుండేవాడని తెలియడంతో కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.



వ్యక్తి మృతదేహం (ఫైల్)

అభివృద్ధిని జోరెత్తించారు

99 శాతం పూర్తయ్యేన డ్రైనేజీ, సీసీ రహదారులు • ఆదర్శంగా నిలుస్తున్న 21, 22 వార్డులు..



తహసీల్దార్ కార్యాలయం సమీపంలో పనులు చేయిస్తున్న కౌన్సిలర్ శ్రీకాంత్ యాదవ్



సీసీ రహదారి పనులు చేయిస్తున్న కౌన్సిలర్ అజయ్

శంషాబాద్: పంచాయతీ కాలంలో వార్డు సభ్యులు.. అవే వార్డులకు గత ఐదేళ్లుగా కౌన్సిలర్లు.. పదేళ్లుగా ప్రజాప్రతినిధులుగా వారిద్దరు ప్రాతినిథ్యం వహిస్తోన్న ఆ రెండు వార్డులు ఇప్పుడు పట్టణంలో అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.. 99 శాతం పనులు పూర్తి చేసి అభివృద్ధిని జోడెత్తించిన జంట వార్డుల కౌన్సిలర్లు పనితీరు శభాష్ అనిపించేలా సాగుతోంది.

పంచాయతీ నుంచి..

ప్రస్తుత మున్సిపాలిటీలోని 21, 22 వార్డులు పాత గ్రామం పరిధిలో ఉంటాయి. 21 వార్డు కౌన్సిలర్‌గా అజయ్, 22 వార్డు కౌన్సిలర్‌గా శ్రీకాంత్ యాదవ్‌లు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. 2014 పంచాయతీలో జరిగిన ఎన్నికల్లో మంచి మెజార్టీతో తొలిసారి వార్డు సభ్యులుగా గెలిచి ప్రజాప్రతినిధులయ్యారు. పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన తర్వాత మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి కౌన్సిలర్లుగా గెలిచింది కేవలం వీరిద్దరు మాత్రమే..

నిత్యం ప్రజల్లోనే ఉంటూ..

పదేళ్లగా తమ వార్డులోని ప్రజల సమస్యలపై సత్వరమే స్పందిస్తున్న అజయ్, శ్రీకాంత్‌లు అభివృద్ధి పనులు పూర్తిచేయించడంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. రెండు వార్డుల్లో 99 శాతం సీసీ రహదారులతో పాటు 99 శాతం అంతర్గత డ్రైయినేజీ పనులు పూర్తయ్యాయి. రెండు వార్డుల మధ్యలో సిద్దప్పరోడ్డు నుంచి రైల్వే రోడ్డు వరకు అత్యంత దుస్థితిలో ఉన్న రహదారిని కూడా ఇటీవలే పూర్తి చేయించారు. దీంతో రెండు వార్డుల పరిధిలో మౌలిక వసతుల పనులు దాదాపుగా పూర్తి ఆదర్శంగా మారాయి.

కోట్లలో నిధులు..

21 వార్డులో సీసీ రహదారులకు 1.20 కోట్లు, డ్రైయినేజీలు 45 లక్షలు, కల్వర్టు 15 లక్షలు, కృష్ణా నీటి పనులు 15 లక్షల నిధులతో పనులు పూర్తయ్యాయి. 22 వార్డులో చిల్డ్రన్స్ పార్కు, సీసీ రహదారులు, డ్రైయినేజీలు కృష్ణా నీటి పనులు, మహావీర్ బీటీ రోడ్డు పనులు మొత్తం 3 కోట్లకు పైచిలుకు నిధులు గత నాలుగున్నర ఏళ్లలో పూర్తయ్యాయి. పంచాయతీ కాలంలో కూడా ఈ రెండు వార్డుల్లో కలిసి మొత్తం రూ. 3 కోట్ల నిధులతో పనులు జరిగాయి. 35 లక్షలతో కమ్యూనిటీహాలు ప్రతిపాదనతో పాటు రైల్వే పరిధిలో ఉన్న భూమిలో కూడా రోడ్డు వేయడం కోసం రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ప్రజల ఆశీర్వాదంతోనే..



పంచాయతీ వార్డు సభ్యులుగా చేసిన అభివృద్ధి పనులతో ప్రజలు మరోసారి ఆశీర్వదించి కౌన్సిలర్‌గా గెలిపించారు. ప్రజలు కనీస అవసరాలైన డ్రైయినేజీ, సీసీ రహదారులు పూర్తి చేయించ గలిగాను. కృష్ణమందిర్, మంగల్‌బస్తీలో సీసీ రోడ్లు, డ్రైయినేజీ పూర్తయితే 100 శాతం పనులు పూర్తవుతాయి. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, చైర్ పర్సన్ సుష్మలు అభివృద్ధి పనులకు సహకరించారు.

– అజయ్, 21 వార్డు కౌన్సిలర్

రైల్వే అధికారులను సంప్రదించాం



22 వార్డు పరిధిలో పంచాయతీ పాలకవర్గంలో దాదాపు 2 కోట్ల పనులు పూర్తి చేయించాం. మున్సిపాలిటీ నుంచి 3. 50 కోట్ల పనులు పూర్తయ్యాయి. సీసీ రహదారులు వందశాతం జరిగాయి. జంట వార్డుల పరిధిలోని సిదప్పరోడ్డు నుంచి రైల్వే రోడ్డు వరకు ఇటీవల రోడ్డు పనులు పూర్తయ్యాయి. రైల్వే పరిధిలో ఉన్న రహదారి దుస్థితిని అధికారులకు వివరించాం.

– శ్రీకాంత్ యాదవ్, 22 వార్డు కౌన్సిలర్

ఉచిత వైద్య సేవలు



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ గాంధీ విగ్రహం దగ్గర సారా మెటర్నిటీ అండ్ జనరల్ హాస్పిటల్ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో చేవెళ్ల బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నారగూడం మల్లారెడ్డి ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి పరీక్షలు చేసి రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి విచ్చేసిన డాక్టర్ రమేష్, వైద్యబృందానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అశోక్, సాబాద విజయ్ కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యశిబిరానికి విశేష స్పందన



దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని డాక్టర్ ఫ్రాన్సిస్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఓ ప్రైయివేట్ రెసిడెన్షియల్ పాఠశాలలో దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు, సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందజేశారు. దంత ఆరోగ్యం ఎంతో ముఖ్యమైందని, దంతాల సంరక్షణపై చిన్నవయస్సు నుంచే శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ వరిణి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్, ఆసుపత్రి సిబ్బంది జహంగీర్, ప్రత్యూష, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రాఖీ పౌర్ణమికి సిద్ధం



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

మణికొండ: సోదరీ, సోదరుల మధ్య అన్యోన్యత, ఆప్యాయత, అనుబంధాలకు ప్రతీకగా జరుపుకునే రాఖీ పౌర్ణమి పండగను ఆనందోత్సవాలతో జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. సోమవారం పౌర్ణమి ఉండటంతో ఆదివారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో మహిళలు పెద్ద ఎత్తున రాఖీలు, స్వీట్ బాక్స్‌లు, చాక్లెట్‌లను కొనుగోలు చేసుకున్నారు. సోమవారం ఉదయమే తమ సోదరుల వద్దకు వెళ్లి రాఖీలను కట్టి వారి ఆశీర్వచనాలు, బహుమతులను తీసుకునేందుకు సిద్ధమయ్యారు. మహిళలు పెద్ద ఎత్తున రాఖీలు, స్వీట్ బాక్స్‌ల కొనుగోలుకు సిద్ధం కావటంతో ఆయా షాపులు కిటకిటలాడాయి.

జోరుగా రాఖీల విక్రయాలు

రాజేంద్రనగర్: రాఖీ పండుగను పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారులు, మార్కెట్ల వద్ద రాఖీ విక్రయాలు జోరుగా కొనసాగాయి. తాత్కాలిక గుడారాలను ఏర్పాటు చేయడంతో పాటు దుకాణాల్లో రాఖీలను పెద్ద ఎత్తున విక్రయించారు. ఆదివారం కావడం.. సోమవారమే పండుగ ఉండటంతో పెద్ద ఎత్తున రాఖీలను కొనుగోలు చేసేందుకు మహిళలు, యువతులు తరలివచ్చారు. దీంతో రాఖీ దుకాణాలలో సందడి నెలకొంది.

హాకీ క్రీడాకారులకు మరిన్ని సదుపాయాలు

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్రంలో హాకీ క్రీడ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆయన ఛాంబర్‌లో తెలంగాణ హాకీ అధ్యక్షుడు కొండా విజయ్, కార్యదర్శి భీంసింగ్,ఆయనను కలిశారు. అక్టోబర్‌లో తెలంగాణ నిర్వహించే తెలంగాణ హాకీ టోర్నమెంట్ నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు గొప్పవరం

గచ్చిబౌలి: ముఖ్యమంత్రి సహయనిధి పేద ప్రజలకు గొప్పవరమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కి దరఖాస్తు చేసుకోగా 20 మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.8.20 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను ఆయన కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి లబ్ధిదారులకు ఆదివారం అందించారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఉపకమిషనర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్ నగర్, శాస్త్రిపురం డివిజన్లకు చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను లిఖిత పూర్వకంగా ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది అందరూ ఈ ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. సమస్యల పరిష్కారం కోసం అక్కడే సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు అందిస్తామన్నారు. నిధులతో కూడుకున్న పనులను సంబంధిత అధికారులు పరిష్కరించి అంచనా నివేదికను తయారు చేస్తారన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యల పరిష్కారాన్ని పొందాలన్నారు.

ఏరులై పారిన వర్షపునీరు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఏకతాటిగా 40 నిమిషాల పాటు కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు అంతర్గత బస్తీల్లో వరదనీరు ఏరులై పారాయి. శివరాంపల్లి, ఉప్పర్‌పల్లి, రాజేంద్రనగర్, నేషనల్ పోలీసు అకాడమీ రహదారులపై వర్షాపు నీరు నిలువడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి చర్యలు చేపట్టారు. దీంతో వరదనీరంతా కాలువల గుండా పారాయి.

నేషనల్ కరాటే చాంపియన్ షిప్‌లో సత్తా



కరాటేలో మెడల్స్ అందుకున్న విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి: షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో మోయినాబాద్‌లోని ఫైర్ పాక్స్ స్పోర్ట్స్ అండ్ రిసార్టులో ఆదివారం జరిగిన రెండవ నేషనల్ కరాటే చాంపియన్ షిప్ 2024 పోటీలలో భాగంగా మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. డివిజన్ శ్రీనివాస్ కరాటే అకాడమికి చెందిన శ్రీ గాయత్రి టెక్నోపాఠశాల విద్యార్థులు సత్తాచాటి మెడల్స్ సాధించారు. భరత్ (13)గోల్డ్ మెడల్, వరుణ్ (8)సిల్వర్ మెడల్, సాయినాథ్(10) సిల్వర్ మెడల్ సాధించారు. విద్యార్థులకు కరాటే అసోసియేషన్ నిర్వాహకులు మెడల్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ కరాటే అకాడమీ మాస్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం తగదు

గోల్కొండ: విధుల్లో అలసత్వం తగదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బల్దియా అధికారులతో కలిసి టోలిచౌకీలో ఆదివారం పర్యటించారు. టోలిచౌకీ చౌరస్తా వద్ద మురుగు నీరు చేరడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, డీఈఈ వెంకటశేషయ్య, మజ్లిస్ నాయకులు ఉన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

గోల్కొండ: దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని గోల్కొండ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. సాలేనగర్‌కు చెందిన దివ్యాంగ టైలర్, ఫ్యాషన్ డిజైనర్ మహ్మద్ జాహేద్ రూపొందించిన పోలీసు లోగోను ఆయన ఆవిష్కరించారు.

పల్లెచెరువులో నిండిపోయిన గుర్రపు డెక్క



గుర్రపు డెక్కతో నిండిపోయిన పల్లెచెరువు

మైలార్‌దేవ్‌పల్లి: మరో నెలరోజుల్లో గణేష్ నిమజ్జనాలు జరుగుతాయి. కాటేదాన్, రాజేంద్రనగర్, బుద్వేల్, బాబుల్‌రెడ్డినగర్, దుర్గానగర్, మార్కండేయనగర్, గగన్ పహాడ్ వంటి ప్రాంతాల నుండి వందలాది గణనాథులను పల్లెచెరువులో నిమజ్జనానికి వస్తుంటాయి. అధికారులు మాత్రం పల్లెచెరువులో గుర్రపు డెక్కను తొలగించడానికి ఇప్పటి వరకు ఎలాంటి పనులు మొదలు పెట్టలేదు. గుర్రపు డెక్కను ఎప్పుడు తొలగిస్తారనే సందేహాలు సైతం వస్తున్నాయి. తొందరగా గుర్రపు డెక్కను తొలగించేలా చర్యలు తీసుకోవాలని మండపాల నిర్వాహకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం గుర్రపు డెక్కను తీయడంలో అధికారులు విఫలం అయ్యారు. చెరువులో ఉన్న గుర్రపు డెక్కను తొలగించాలని చెరువుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు అడికే మహేందర్ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కొన్ని సంవత్సరాల క్రితం పల్లెచరువు నీటితో కలకలలాడేది. నిమజ్జనానికి భారీ వినాయకులు పల్లెచెరువులోకి వస్తుండేవి. కానీ రానురాను పల్లెచెరువుల్లో నిమజ్జం చేసేందుకు వచ్చే వినాయకుల సంఖ్య తగ్గుతూ వస్తుంది. దీనికి కారణం చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క. ఇరిగేషన్ డిపార్టుమెంటు వారు పల్లెచెరువులో గుర్రపు డెక్కను తొలగించడాకి గతంలో భారి యంత్రాలు తీసుకువచ్చి నామ మాత్రంగా పను లు చేసి చేతులు దులుపుకున్నారని స్థానికులు తెలుపుతున్నారు. ఇప్పుడైన గుర్రపు డెక్కను తొలగించే విధంగా చేయాలని లేదా రాజేంద్రనగర్ డివిజన్ పత్తి కుంటను ఎలా నిర్మించారో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో కూడా వందలాది గణనాథులను నిమజ్జనం చేసే విధంగా విశాలమైన సంపును ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నిమజ్జనం కోసం సంపును ఏర్పాటు చేయాలి



మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పల్లె చెరువు సమీపంలో మంచినీటి సంపును నిర్మించాలి. చెరువులో గుర్రపు డెక్కను తొలగించడం సాధ్యం కాని యెడల భారీ సంపును ఏర్పాటు చేసి నిమజ్జనం చేసే విధంగా చూడాలని అధికారులను కోరుతున్నాను. గతంలో అనేక మార్లు చెరవును శుభ్రం చేయడానికి అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికి ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైన చెరువును శుభ్రం చేసి ప్రజలకు ఉపయోగపడేవిధంగా చేయాలని కోరుతున్నాను. – అడికే మహేందర్